రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు

ఎస్‌ఆర్‌టీ కాలనీలో ఇష్టారాజ్యంగా మట్టి, ఇసుక, చెత్తాచెదారం డంపింగ్

● పట్టించుకోని జీహెచ్‌ఎంసీ


ఎస్‌ఆర్‌టి భగత్‌సింగ్ పార్కు సమీపంలోని రహదారిలో డంప్ చేసిన భవన వ్యర్థాలు


జెక్‌కాలనీలో ఫుట్‌పాత్‌పై డంప్ చేసిన భవన వ్యర్థాలు

బేగంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్‌లోని ఎస్‌ఆర్‌టి కాలనీ పార్కులకు నిలయంగా ఉంటుంది. కాలనీలో పదుల సంఖ్యలో పార్కులు ఉంటాయి. ప్రధానంగా సీనియర్ సిటిజన్‌లు ఇక్కడ ఉదయం, సాయంత్రం వేళ పార్కుల్లో సేదతీరుతుంటారు. ప్రస్తుతం ఈ కాలనీ రహదారులు భవన నిర్మాణ వ్యర్థాలకు నిలయంగా మారాయి. ప్రధానంగా ఇల్లు నిర్మించుకునే వారు పాత ఇంటిని తొలగించినప్పుడు ఆ వ్యర్థాలను లారీల ద్వారా తరలించాలి. కానీ, ఇక్కడ రోడ్లపై కుప్పలుగా పోస్తున్నారు. నెలలు గడుస్తున్నా జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తున్నాయి. దీనికి తోడు రహదారుల్లో తీవ్ర పారిశుధ్య సమస్య నెలకొంది. పలు చోట్ల చెత్త కుప్పలుగా పేరుకుపోయినా తొలగించే వారే కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినా రహదారులపై వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారుల్లో డంప్ చేసిన భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని, డంప్ చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


రవీందర్‌నగర్ కాలనీలో రోడ్డును తవ్వి కుప్పగా పోసిన రాళ్లు, మట్టి


జయభారతి స్కూల్ చౌరస్తాలో రహదారిపై కుప్పగా పోసిన మట్టి, రాళ్లు


వెల్ఫేర్ గ్రౌండ్ నుంచి మీ-సేవకు వెళ్లే రోడ్డులో ఉన్న మట్టి, చెత్తాచెదారం

డీపీడీపీ చట్టం నుంచి జర్నలిస్టులను మినహాయించాలి

పంజాగుట్ట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్(డీపీడీపీ) చట్టం పరిధి నుంచి జర్నలిస్టులను మినహాయించాలని, డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ చట్టం-2023 అమల్లోకి వస్తే జర్నలిస్టులు రాసే, ప్రచురించే హక్కు కోల్పోతారని నేషనల్ క్యాంపెయిన్ ఫర్ పీపుల్స్ రైట్ టు ఇన్ఫర్మేషన్ సంస్థ సభ్యులు రాకేశ్ దుబ్బుడు, అంజలి భరద్వాజ్, అమృత జోహ్రీ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమాజానికి సంబంధించిన అంశాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే జర్నలిస్టుల హక్కులకు ఎదురయ్యే ప్రమాదాల గురించి వారు వివరించారు. మొదట ఉన్న చట్టం ముసాయిదాల్లో జర్నలిస్టులకు మినహాయింపు ఉండగా, పార్లమెంట్‌లో పాసైన బిల్లులో మినహాయింపు ఇవ్వలేదని అన్నారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఆర్.రవికాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సి.వనజ, కార్యవర్గ సభ్యులు వి.బాపు రావు, పద్మావతి, టి.శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.


విద్యపై అవగాహన కల్పిస్తున్న ఆయా యూనివర్సిటీల ప్రతినిధులు

జర్మనీ, యూకేలో విద్యపై అవగాహన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): యూఎస్ కలలు కరిగిపోతున్న వేళ, విదేశీ విద్యనభ్యసించాలని ఆశిస్తోన్న విద్యార్థులు ప్రత్యామ్నాయాల కోసం అన్వేషిస్తున్నారు. అలాంటి వారు ఇటీవలకాలంలో యూకే, జర్మనీ వంటి దేశాల వైపు చూస్తున్నారు. ఈ విద్యార్థులకు ఆ దేశాల్లో అందుబాటులోని ఉత్తమ యూనివర్సిటీలు, అక్కడి వసతి, ఉపాధి అవకాశాలు తదితర అంశాలను గురించి అవగాహన కల్పించేందుకు జర్మనీ, యూకే ఎడ్యుఫెయిర్-2025ను నిర్వహించింది యాతావు కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్. ఐ20 ఫీవర్‌గా గుర్తింపు పొందిన ఈ కన్సల్టెన్సీ వ్యవస్థాపకులు నవీన్ యాతావు మాట్లాడుతూ విద్యార్థులను సరైన యూనివర్సిటీలతో కలపడం తమ లక్ష్యమని తెలిపారు. ఈ ఫెయిర్‌లో కన్‌స్ట్రక్టర్ యూనివర్సిటీ, ఎడిన్‌బర్గ్ నైపర్ యూనివర్సిటీ సహా 20కు పైగా సుప్రసిద్ధ యూనివర్సిటీలు పాల్గొన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జర్మనీలో జీవితంపై కన్‌స్ట్రక్టర్ యూనివర్సిటీ రిక్రూట్‌మెంట్ స్పెషలిస్ట్ ఒటామన్ తైజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు.


హెచ్‌ఐసీసీలో జరిగిన భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి


ఎన్టీఆర్ మార్గం భారీ అంబేడ్కర్ విగ్రహం ఎదుట పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి, కృష్ణప్రసాద్, వీఎస్ బోస్, కమతం యాదగిరి, స్టాలిన్ తదితరులు



రసూల్‌పురా వద్ద జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో ఏఐసీసీ ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరా, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ, విశాల్ సుదాం, హనిఫ్‌ఖాన్ తదితరులు


వెంగళరావునగర్ టి-జంక్షన్ నుంచి ఎస్‌ఆర్ నగర్ ప్రధాన రహదారి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వెంగళరావునగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు, శౌరి రాజు, అర్జున్, సునీత, రాజశేఖర్‌గుప్తా, జబ్బార్ తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న చిలుకూరు బాలాజీ మందిరం ప్రధాన అర్చకులు సీ.ఎస్ రంగరాజన్

మునివాహన ఉత్సవాలు చేస్తున్నందుకే నాపై దాడి

● చిలుకూరు బాలాజీ మందిరం ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్

పంజాగుట్ట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దళితులను భుజంపై ఎక్కించుకుని ఆలయంలోకి ప్రవేశింప చేసే మునివాహన ఉత్సవాలు చేస్తున్నందుకే తనపై దాడి చేశారని చిలుకూరు బాలాజీ మందిరం ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ చెప్పారు. తనపై దాడి చేయడమే కాక అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానన్నారు. పరువు నష్టం దావా కూడా వేస్తానన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మారేడు మోహన్, నగర ప్రధాన కార్యదర్శి కె.అర్వింద్ కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 7న తన ఇంటిపైకి 20 మందికి పైగా వచ్చి దాడికి పాల్పడ్డారని రంగరాజన్ తెలిపారు. రామరాజ్యం కోసం ఏం పని చేస్తున్నావని ప్రశ్నిస్తూ తన భుజంపై నామాలు ఉన్న చోట కాలుతో తన్నారని ఆయన చెప్పారు. ఉగాదిలోగా సైన్యాన్ని నిర్మించడమేకాక, వనరులు ఏర్పాటు చేయాలన్నారని గుర్తు చేశారు. చిన్న జీయర్ స్వామి తమ టార్గెట్ అంటూ వెళ్లిపోయారని రంగరాజన్ తెలిపారు.

బీఆర్‌ఎస్ సభకు భారీగా తరలిరావాలి

బేగంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో నేడు జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని ఆ పార్టీ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు.సోమాజిగూడ డివిజన్ నుంచి భారీ సంఖ్యలో వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మాజీ కార్పొరేటర్ ఎలిగల మహేష్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం రాత్రి సోమాజిగూడలో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మీనారాయణమ్మ, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అహ్మద్, జకీర్, మధుకర్‌యాదవ్ పాల్గొన్నారు.

10 బస్సులు, 15 కార్లు

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ డివిజన్ నుంచి 10 బస్సులు, 15 కార్లలో సుమారు 700 మంది సభకు వెళ్తున్నట్లు బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధానకార్యదర్శి ఐలపాక నర్సింగ్‌దాస్ తెలిపారు. కార్పొరేటర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇప్పటికే సభకు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు.

రక్తమార్పిడి సమయంలో అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రక్తమార్పిడి సమయంలో అప్రమత్తంగా ఉండాలని, నిల్వ చేసిన రక్త భాగాలలోని తెల్ల రక్త కణాలు సైటోకైన్ల వంటి బయోలాజికల్ పదార్థాలను విడుదల చేస్తాయని, ఇది ఇన్‌ఫ్లమేటరీ ప్రతిచర్యలకు దారితీయవచ్చునని నిమ్స్ వైద్యులు పేర్కొన్నారు. శనివారం నిమ్స్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో ఆధునిక పద్ధతి ద్వారా రక్తమార్పిడి భద్రత అభివృద్ధిపై వర్క్‌షాప్ నిర్వహించారు. నిమ్స్ బ్లడ్ సెంటర్ విభాగం అధిపతి డాక్టర్ వి.సుధీర్ కుమార్, ప్రొఫెసర్ డాక్టర్ శాంతి, మైక్రోబయాలజీ విభాగం అధిపతి డాక్టర్ తేజ, మెడికల్ అంకాలజీ డాక్టర్ సదాశివుడు, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగం అధిపతి డాక్టర్ వేణుమాధవ్, బ్లడ్ సెంటర్ వైద్యులు డాక్టర్ మహేష్, డాక్టర్ మురళీ కృష్ణ మాట్లాడారు. రక్త మార్పిడి చేసేముందు రక్త ఉత్పత్తుల నుంచి తెల్లరక్తకణాలను(ల్యూకోసైట్లను) తీసివేయడాన్ని లియుకోరెడక్షన్ అనేది ట్రాన్స్‌ఫ్యూషన్‌గా వ్యవహరిస్తామని, ఇది మెడిసిన్‌లో ఉపయోగించే ఒక ప్రక్రియ అని వైద్యులు వివరించారు. ఇమ్యూనోకంప్రమైజ్డ్, శస్త్రచికిత్స చేయించుకున్న రోగుల్లో మెరుగైన ఫలితాలు, శస్త్రాంతర ఇన్‌ఫెక్షన్లు ఆస్పత్రిలో ఉండే కాలం తగ్గించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో బిడుగు శేఖర్, వెంకటరత్నం, సుజాత, నాగేశ్వరావు, భాస్కర్‌రెడ్డి, పద్మజ, చిరంజీవి, సేతులక్ష్మి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


నిమ్స్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

పీపుల్స్‌ప్లాజాలో సమ్మర్ ఉత్సవ్ మేళా ప్రారంభం


ప్రదర్శనలో అందమైన ఆకృతులను తిలకిస్తున్న హెచ్‌ఎండీఏ ఓఎస్‌డీ చంద్రారెడ్డి, నిర్వాహకుడు రఫీక్‌బేగ్ తదితరులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి యేటా ఓ వైవిధ్యంతో ఏర్పాటయ్యే సమ్మర్ ఉత్సవ్ మేళా ఈసారి సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పీవీ నర్సింహారావు మార్గంలోని పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటైన ఈ మేళాలో సందర్శకులు విమానం ఎక్కి ప్రయాణిస్తున్న అనుభూతితో పాటు ఆకాశం, మేఘాల అందాలను చూస్తూ దుబాయ్ వెళ్లిన అనుభూతి కలిగేలా చేసిన ఏర్పాట్లు సందర్శకులను మంత్రముగ్దులను చేస్తున్నాయి. సమ్మర్ మేళాలోకి వెళ్లే ప్రధాన మార్గం భారీ విమానం ఆకారంలో ఉండగా అందులోకి మాక్ ఎయిర్‌లైన్ ల్యాండింగ్‌లో వెళ్లి అచ్చం విమానంలో ఉన్నామనే భావన కల్పిస్తూ గ్రహాంతరవాసులను చూస్తూ బుర్జ్ ఖలీఫా భవనం వాక్‌త్రూతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటైన ఫిష్ టన్నెల్‌లో వందలాది రకాల చేపలను చూస్తూ వాటితో సెల్ఫీలు దిగి దుబాయ్‌కి వెళ్లిన అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేశారు. హెచ్‌ఎండీఏ ఓఎస్‌డీ చంద్రారెడ్డి ఈ సమ్మర్ మేళాను శనివారం రాత్రి ప్రాంభించి ప్రదర్శనలో ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. అనేక రాష్ట్రాల వస్తువులతో కూడిన స్టాళ్లతో పాటు రకరకాల ఎమ్యూజ్‌మెంట్లు, పిల్లల నుంచి పెద్దల వరకు ఎంజాయ్ చేసే ఏర్పాట్లతో పాటు ఇష్టమైన తినుబండారాలను రుచి చూసే అవకాశం ఇందులో కల్పించారు. ప్రదర్శన ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుందని నిర్వాహకుడు మీర్జా రఫీక్ బేగ్ తెలిపారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ టీచింగ్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. యూనివర్సిటీలోని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం ఆరో రోజు కొనసాగింది. యూనివర్సిటీ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ టీచింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రొ.పి.వెంకటరమణ, ప్రొ.బి.శ్రీనివాస్, ప్రొ.జి.దయాకర్, ప్రొ.రవీంద్రనాథ్ సోలోమన్, ప్రొ.కిశోర్ కుమార్‌రెడ్డి మద్దతు తెలిపారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షుడు డా.కె.అవినాష్, ప్రధానకార్యదర్శి డా.ఎం.కిషోర్, సలహాదారులు డా.కె.యాదగిరి. డా.కాసం విజయ్, ఉపాధ్యక్షులు, కె.ఉమాదేవి, సంయుక్త కార్యదర్శి డా.పి.రాధాకృష్ణ, కోశాధికారి డా.వై.కుమార్, కాంట్రాక్ట్ అధ్యాపకులు డి.కోటేశ్వరరావు, డా.పడాల లక్ష్మణ్, డా.సునీల్‌కుమార్, డా.విజయ ఉషశ్రీ, డి.శ్రీవేణి, డా.అరుణ సిద్ధాంతి, డా.కురుమేటి దయాకర్, నర్సయ్య భట్టు పాల్గొన్నారు.


కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మద్దతు తెలుపుతున్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ టీచింగ్ అసోసియేషన్ ప్రతినిధులు


మజ్జిగ అందజేస్తున్న శ్రీ కల్కి సేవా సమితి ప్రతినిధులు

మజ్జిగ పంపిణీ

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట చౌరస్తా శ్రీనివాసనగర్ బస్టాప్‌లో పాదాచారులకు శ్రీ కల్కి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. సమితి ప్రతినిధులు శ్రీదేవి, రాజ్యాలక్ష్మి మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ పరిధిలో తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు నటరాజ్, రమ, విజయ, రాధిక, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అమీర్‌పేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరి సంక్షమం కోసం నిరంతరం తపించే పోలీసులు తమ గురించి, తమ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించాలని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి సీఈఓ డాక్టర్ దేవానంద్ సూచించారు. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ పోలీసులు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. శిబిరంలో ఏసీపీ బాలగంగిరెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్‌తో పాటు సుమారు వంద మంది పోలీసులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పోలీసులు

ఉత్సాహంగా హోంసైన్స్ కళాశాల వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న హోంసైన్స్ కళాశాల యువతులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధంగా నడుస్తున్న సైఫాబాద్ సామాజిక విజ్ఞాన కళాశాల(హోంసైన్స్ కళాశాల) 61వ వార్షికోత్సవ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు డ్యాన్స్‌లతో యువతులు అదరగొట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐసీఏఆర్-ఐఐఎంఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తార సత్యవతి కళాశాల డీన్ డాక్టర్ కేవీ రమణరావు తదితతరులతో కలిసి పలు రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ విద్య, వృత్తి రంగాల్లో నేడు మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తూ అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. కళాశాల వార్షిక మేగజైన్ స్మృతిని అతిథులు విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.


చిన్నారులతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లోవకుమారి

ప్లే స్కూళ్లకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలు

బోరబండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్లే స్కూళ్లకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లోవకుమారి తెలిపారు. బోరబండ బలహీనవర్గాల కాలనీ జయవంత్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం జరిగిన గ్రాడ్యుయేషన్ డేకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిన్నారులకు ఆమె పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం చిన్నారుల ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కె.నిర్మల, నాగేశ్వరి, జ్యోతినగర్-1 అంగన్వాడీ టీచర్ ఆర్.శాంత, సిబ్బంది జగదాంబ, స్థానిక నాయకులు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు కోసం హిజ్రాల హంగామా.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగలషాపు ప్రారంభోత్సవంలో డబ్బు కోసం హిజ్రాలు హంగామా సృష్టించారు. పాతబస్తీకి చెందిన రుచిత్ అగర్వాల్ బంజారాహిల్స్ రోడ్డు నెంబరు.2లోని గోయల్ జువెలరీస్ పేరిట ఈ నెల 25న కొత్త షాపును ప్రారంభించాడు. ఈ విషయం తెలుసుకున్న 25 మంది హిజ్రాలు షాపులోకి వచ్చి డబ్బు కోసం నానా హంగామా సృష్టించారు. ఇచ్చిన డబ్బు చాలదంటూ ఇంకా ఎక్కువ కావాలని డిమాండ్ చేశారు. ఈ లోపు అక్కడకు పోలీసు పెట్రోలింగ్ వ్యాన్ రావడంతో నిర్వాహకులు పోలీసుల సహాయం తీసుకున్నారు. హిజ్రాలను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. అనంతరం షోరూం మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హిజ్రాలపై 329(2), 308(3), 189(3), 351(2) బీఎన్‌ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పా ముసుగులో వ్యభిచారం

బంజారాహిల్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్పా ముసుగులో వ్యభిచారం చేస్తున్న పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు .7లో స్మైలీ బ్యూటీ స్పాలో వ్యభిచారం జరుగుతుందని బంజారాహిల్స్ ఎస్ఐ రమేష్‌కు ఫిర్యాదు అందింది. వెంటనే ఆయన తన సిబ్బందితో ఈనెల 25న దాడి చేశారు. స్పాకు వచ్చే వినియోగదారుల వద్ద నుంచి రెండు వేలు తీసుకొని యువతులతో వ్యభిచారం చేయిస్తున్నట్టు నిర్ధారణ అయింది. స్పా నిర్వాహకుడు బోయిని బస్వరాజుతోపాటు ముగ్గురు సెక్స్ వర్కర్లు, ఇద్దరు విటులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సెక్స్ వర్కర్లను రిహాబిలిటేషన్ కేంద్రానికి తరలించారు.

అర్ధరాత్రి తర్వాత తెరిచిన బార్‌పై కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా తెరిచి ఉంచి వ్యాపారం చేస్తున్న బార్ నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కానిస్టేబుల్ నరేందర్‌కుమార్ ఈనెల 24న అర్ధరాత్రి విధులు నిర్వహిస్తున్నాడు. పెట్రోలింగ్ చేస్తుండగా ఇందిరానగర్‌లోని అమృత బార్ సమయం మించిపోయినప్పటికీ తెరిచి ఉంచి వ్యాపారం చేస్తున్నట్టు గమనించాడు. అతడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు బార్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

అమీర్‌పేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఒకరిని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అమీర్‌పేటలోని ఏషియన్ సత్యం మాల్ సమీపంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బందితో కలిసి శనివారం ఆకస్మికంగా దాడి చేశారు. యూసుఫ్‌గూడ సమీపంలోని మధురానగర్‌కు చెందిన భరత్‌కుమార్ పంపన(38) తన మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో రెండు నెలలుగా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. భరత్‌కుమార్‌ను అరెస్ట్ చేసి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి బ్యాంక్ ఖాతాలో రూ.2,640 నగదు ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





నాలా పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర

బస్తీ బాటలో కార్పొరేటర్

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : బస్తీబాటలో భాగంగా రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు పనులను శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నల్లగుట్టలో నాలా పూడికతీత పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ డీఈ మహేష్, ఏఈ శివ ప్రసాద్‌లతో పరిశీలించారు. లో ప్రెషర్‌తో మంచినీటి సరఫరా జరుగుతున్న ప్రాంతాల్లో వాటర్ వర్క్స్ మేనేజర్ రమేష్‌తో కలిసి ప్రజలతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. చుట్టాలబస్తీలోని యూపీహెచ్‌సీని సందర్శించి డాక్టర్ ఫణి, ఇతర సిబ్బందితో చర్చించి ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత ఉందా, ఇతర సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం విషయమై శానిటేషన్ డీఈ శ్రీనివాస్, ధనాగౌడ్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం మెక్లోడ్‌గూడలో నివసించే సామాజిక కార్యకర్త నర్సింగం సతీష్ ఆరోగ్య పరిస్థితి గురించి అతడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. పర్యటనలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్, నాయకులు మదన్ పులి, శ్రీనివాస్ యాదవ్ స్వప్న, కోమల్, సాగర్ దొంతి, ధన్‌రాజ్, రఘు, అఫ్జల్, ప్రవీణ్, నితేష్ బోలే తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌స్పెక్టర్ పరశురామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సందీప్ వర్మ తదితరులు

వలసదారులపై కార్డన్ సర్చ్ నిర్వహించాలి

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కొన్ని సంవత్సరాలుగా డివిజన్ పరిధిలో బెంగాలీలు ఎంతో పెరిగిపోయారు. అందువల్ల వారిలో బెంగాలీలు ఎవరో, బంగ్లాదేశీయులు ఎవరో నిగ్గు తేల్చాలని రాంగోపాల్‌పేట్ డివిజన్ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సందీప్ వర్మ శనివారం మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కలాసీగూడ, ఓల్డ్ బోయిగూడ, పాన్ బజార్, ఖండోజీ బజార్, ఆవుల మంద, రంగ్రేజ్ బజార్ ప్రాంతాల్లో బెంగాలీల గుర్తింపుతో అనుమానాస్పద బంగ్లాదేశ్ అక్రమ వలసదారులపై కార్డెన్ సర్చ్ నిర్వహించాలని ఫిర్యాదులో అభ్యర్థించారు. సందీప్ వర్మతో పాటు మాజీ అధ్యక్షుడు ఆకుల ప్రతాప్, నాయకులు అనీష్ వర్మ, మనోజ్ ఉపాధ్యాయ్, భారత్ రాజ్, మనోహర్ తదితరులు ఉన్నారు.



నాగులూరి సాయిబాబాతో హమాల్‌బస్తీ నాయకులు

అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు వినతి

పద్మారావునగర్, ఏప్రిల్ 26(ఆంధజ్యోతి): .హమాల్‌బస్తీలో అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు సహకరించాలని అంబేడ్కర్ సంక్షేమ సంఘం, కాంగ్రెస్ నాయకులు శనివారం నాగులూరి సాయిబాబాను కలిసి విన్నవించారు. స్పందించిన ఆయన విగ్రహాల ఏర్పాటుకు సహకరిస్తానని హామీనిచ్చారు. దానితో పాటుగా ఫంక్షన్ హాల్ నూతన కమిటీని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. శివప్ప, శభాష్, యాదగిరి, బస్వరాజ్, సంపత్, నర్సింగ్, దేవేందర్, సత్యనారాయణ, దేవుడు, వెంకట్, అంజయ్యలు పాల్గొన్నారు.

హమాల్‌బస్తీ అంగన్‌వాడీలో ఈసీసీ డే..

● బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి హమాల్‌బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఈసీసీ డే నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులను అంగన్‌వాడీ టీచర్ కుల్సుమ్ ఆటలు పాటలతో అలరించారు. అనంతరం సంవత్సరం పాటు వారి ఆరోగ్య, విద్య ప్రగతిని తెలిపే కార్డులను అందజేసారు.హెల్పర్ భాగ్యమ్మ,చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోసం చేసిన భాగస్వాములపై కేసు

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): యాక్సిడెంట్‌లో మృతి చెందిన తన కొడుకును వ్యాపార భాగస్వాములు మోసం చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి మార్కెట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మల్లిఖార్జున్ యాదవ్, మేధా రెడ్డి, పవన్ సాయి అసాది భాగస్వామ్యులుగా టింబర్ ఫోర్ట్ కనస్ట్రక్షన్ ఎల్‌ఎల్‌పీ కంపెనీ ప్రారంభించారు. గత సంవత్సరం నవంబరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లిఖార్జున్ మృతి చెందాడు. వ్యాపార భాగస్వామ్యులు మల్లిఖార్జున్ ఫోన్‌ను అతడి తల్లికి ఇవ్వకుండా దగ్గర పెట్టుకుని కంపెనీకి చెందిన రూ.32 లక్షలు మేధారెడ్డి ఆమె తండ్రి రవి రెడ్డి అకౌంట్‌కు మళ్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై డిసెంబరు 18న బొల్లారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. దీంతో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు మృతుడి తల్లి ఫిర్యాదు చేశారు. సీపీ సూచనతో ఈ నెల 23న మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో మేధారెడ్డి, రవిరెడ్డి, సాయి పవన్ అసాదిలపై ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు.

తిరుమలగిరిలో మహిళ అదృశ్యం



ప్రసాద కుమారి

తిరుమలగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మానసిక రుగ్మతతో బాధపడుతున్న ఓ మహిళ అదృశ్యమైన సంఘటన తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ రెడ్డి కథనం ప్రకారం.. లోతుకుంట మారుతీనగర్‌కు చెందిన వేంకటేశ్వర్‌రావు, ప్రసాదకుమారి(65) భార్యాభర్తలు. అయితే ప్రసాదకుమారి కొన్ని సంవత్సరాలుగా మానసిక రుగ్మతతో బాధపడుతూ, మందులు కూడా వాడుతోంది. శుక్రవారం ఉదయం భర్త అల్పాహారం తీసుకురావడానికి బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి భార్య ఇంటిలో లేదు. దీంతో తెలిసిన వారిని, బంధువులను అడిగినా ఫలితం లేకపోవడంతో శనివారం రాత్రి తిరుమలగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.





ఉగ్రదాడిలో మృతి చెందినవారి ఆత్మలకు శాంతి చేకూరాలని సికింద్రాబాద్ మిల్లర్ ఛాంబర్ నుంచి సిటీలైట్ హోటల్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించిన చిత్రం

తాగునీటి కష్టాలు తీర్చాలి

ఇబ్బందులు పడుతున్న వారాసిగూడ ప్రజలు

● పనిచేయని పవర్‌బోర్లు, చేతిపంపులు
● తగ్గుతున్న నీటి సరఫరా



వారాసిగూడలో నిరూపయోగంగా ఉన్న సింటెక్స్‌ట్యాంకు



వారాసిగూడ పోచమ్మ ఆలయ వీధిలో శిథిలావస్థలో చేతిపంపు

బౌద్ధనగర్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. జలమండలి రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా అవుతున్నా పలు బస్తీలు, కాలనీల్లో పవర్ బోర్‌వెల్స్, చేతిపంపులు పనిచేయకపోవటంతో నీటి సమస్యలు తలెత్తున్నాయి. రోజు విడిచి రోజు సరఫరా అయ్యే మంచినీటిని కొంతమంది మోటార్ల సహాయంతో తోడేస్తున్నారు. దీంతో కొంత మందికి అంతంతమాత్రమే సరఫరాతో తాగునీరు ఉండటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో తాగునీటి సరఫరాపై అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తూ ప్రణాళికలు చేసి నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. శ్రీనివాస్‌నగర్, వారాసిగూడ, సీతాఫల్‌మండి జలమండలి సెక్షన్ పరిధిలోని బౌద్ధనగర్, వారాసిగూడ, అంబర్‌నగర్, న్యూఅశోక్‌నగర్, పార్శీగుట్ట, శ్రీనివాస్‌నగర్, మహ్మద్‌గూడ, షాబాద్‌గూడ, శ్రీదేవి నర్సింగ్‌హోమ్, ఇందిరానగర్‌కాలనీ, మేడిబావి, బీదలబస్తీ, మైలార్‌గడ్డ, కిందిబస్తీ తదితర ప్రాంతాలకు రోజు, రోజు విడిచి నీటి సరఫరా అవుతుంది. ప్రతిరోజు గంట సమయం పాటు మంచి నీటిని సరఫరా చేస్తారు. మరికొన్ని చోట్ల గంటలోపు మాత్రమే సరఫరా అవుతుందని, అదికూడా సన్నటి ధారతో రావటంతో నీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్‌ల్లో పర్యటించినప్పుడు వారికి ముందుగా ప్రజల నుంచి వినిపించే మొట్టమొదటి సమస్య మంచినీటి సమస్యే. గతంలో ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం అదికూడ లేకపోవటంతో కేవలం కమర్షియల్ వాటర్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని తెలుపుతున్నారు. మురికివాడలు, నీటి సమస్యలున్నా ప్రాంతాల్లో ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావిలో మంచినీటి సమస్య అధికంగా ఉంది. ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లినా వారు స్పందించలేదని స్థానికులు వాపోతున్నారు. పార్శీగుట్ట, న్యూఅశోక్‌నగర్, శ్రీనివాస్‌నగర్ ఫ్రైడే మార్కెట్ పరిధిలో కొన్ని చోట్ల కలుషిత నీరు సరఫరా అవుతుందని స్థానిక మహిళలు వాపోతున్నారు.

నిరూపయోగంగా చేతిపంపులు, పవర్ బోర్‌వెల్స్

సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజనల్లోని పలు ప్రాంతాల్లో గతంలో ఏర్పాటు చేసిన చేతిపంపులు, సింటెక్స్ ట్యాంకులు, పవర్‌బోర్‌వెల్స్ నిరూపయోగంగా మారాయి. చేతి పంపులు భూమిలోకి దిగిపోవటంతో శిథిలావ్యవస్థకు చేరాయి. సిబ్బంది నిరూపయోగంగా ఉన్న కొన్ని చేతి పంపులకు మరమ్మతులు చేపట్టిన ప్రయోజనం లేకయియింది. ఇక పవర్‌బోర్‌వెల్స్ విషయానికొస్తే రెండు విభాగాల మధ్య సమన్వయ లోపంతో విద్యుత్ సరఫరా ఇవ్వకపోవటంతో నిరూపయోగంగా ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నీటి సమస్యల తలెత్తకుండా ముందుస్తూ చర్యలు తీసుకోవాలని స్థానికులు, మహిళలు కోరుతున్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి

వేసవికాలంలో రోజు, రోజుకు నీటి కష్టాలు ఎక్కువ అవుతున్నాయి. ప్రజల దాహార్తిని తీర్చవలసిన అధికారులు, పాలకులు పట్టించుకోవటం లేదు. డివిజన్‌లోని చాలా చోట్ల మంచినీటి సమస్య ఉంది. పనులు వదులుకొని మంచినీరు ఎదురు చూడాల్సి వస్తోంది అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా బస్తీల్లో పర్యటించి మంచినీటి సమస్యను పరిష్కరించాలి. నిత్యం మంచినీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలి.



- వల్లారపు శ్రీనివాస్‌కుమార్, టీడీపీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి

సమస్య లేకుండా చూడాలి

మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి. మేడిబావిలో లోప్రెషర్ వల్ల ఇబ్బందులు పడుతున్నాం. పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరుకోవడంతో అప్పుడప్పుడు కలుషిత నీరు సరఫరా అవుతోంది. వాటర్‌ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలి. బస్తీలో ఏర్పాటు చేసిన పవర్‌బోర్‌వెల్‌లు నిరూపయోగంగా ఉన్నాయి.



- పుష్పా, మేడిబావి

రజతోత్సవ సభకు జన సమీకరణ

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వరంగల్ సభకు భారీ జన సమీకరణ చేస్తున్నామని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్ తెలిపారు. శనివారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఛలో వరంగల్‌కు బయలుదేరే వాహనాలకు స్టిక్కర్లను ఎమ్మెల్యే అతికించారు. పద్మారావుగౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలోని బస్తీలు, కాలనీల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా సభకు వస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీతా, ప్రసన్నలక్ష్మీ, కన్వీనర్ రాజుసుందరం మాజీ కార్పొరేటర్ కందినారాయణ, నాయకులు సుంకు రామచందర్, బెజ్జంకి రాజేష్, మేడిశెట్టి బాలాజీ, శైలేందర్, టీఆర్‌టీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌కు గులాబీ మహిళా దండు : భాగ్య

అడ్డగుట్ట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ సభకు తుకారాంగేట్ నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివెళుతున్నారని బీఆర్‌ఎస్ నాయకురాలు భాగ్య తెలిపారు. తుకారాంగేట్, అడ్డగుట్ట నుంచి దాదాపు వంద మంది మహిళలతో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు, తుకారాంగేట్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నక్కా మధు ఆధ్వర్యంలో సభకు పెద్ద సంఖ్యలో వెళుతున్నామన్నారు.

భారీగా తరలి రావాలి: మాజీ కార్పొరేటర్

బేగంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 27న జరిగే బీఆర్‌ఎస్ సభకు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని మాజీ కార్పొరేటర్ ఎలిగల మహేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం రాత్రి సోమాజిగూడలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు పెద్దఎత్తున కార్యకర్తలు వెళ్లనున్నట్టు పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ లక్ష్మి నారాయణమ్మ, డివిజన్ అధ్యక్షులు ఆహ్మద్, నాయకులు జకీర్, మదుకర్‌యాదవ్ పాల్గొన్నారు.



నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

బోయినపల్లిలో..

అబద్దపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. 27న తలపెట్టిన బీఆర్‌ఎస్ సభకు సంబంధించిన స్టిక్కర్, వాహనాలకు అంటించడానికి గోడ పత్రికలను శనివారం బోయినపల్లిలోని బిఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేష్, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్, బోయినపల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ టిఎన్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకురాలు నివేదిత బోర్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్‌లతో పాటు మల్కాజిగిరి నియోజకవర్గం, కంటోన్మెంట్ నియోజకవర్గం కార్యకర్తలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి - ఎమ్మెల్యే తలసాని

మారేడుపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రసాధన కోసం పుట్టిన ప్రాంతీయ పార్టీ 25 వసంతాల వేడుకలను జరుపుకోవడం ఒక చరిత్ర అని, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. 27వ తేదీన ఉదయం 10 గంటలకు డివిజన్‌లలో పార్టీ పతాకాలను ఎగురవేసి సభకు బయలు దేరాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సభ విజయవంతం చేసేందుకు బాధ్యతగా తీసుకోవాలని అన్నారు.



ముఖ్య నాయకులతో సమావేశమై మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

కారు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

బౌద్ధనగర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కారు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ వివరాల ప్రకారం లంగర్‌హౌస్ ప్రాంతానికి చెందిన మహేందర్‌రెడ్డి శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి పద్మారావునగర్‌లోని స్కందగిరి ఆలయానికి వచ్చారు. దర్శనం అనంతరం తిరిగి వెళ్లే సమయంలో మహేందర్‌రెడ్డి కారును తీశాడు. ఆ కారు ముందు చెట్టు నీడలో వృదురాలు యాచన చేయటానికి కూర్చొని ఉంది. ఈ క్రమంలో మహేందర్‌రెడ్డి కారు ముందు కూర్చున వృద్ధురాలిని గమనించకుండా కారును ముందుకు తరలించాడు. దీంతో వృద్ధురాలు కారు చక్రాలకు కిందకు వెళ్లిపోయింది. అది చూసిన కొందరూ కేకలు వేయటంతో అతడు కారుకు బ్రేక్ వేశాడు. కారు కిందికి వెళ్లిన వృద్ధురాలిని బయటకు తీసి 108 అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రి తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రసూల్‌పురా వద్ద జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో ఏఐసీసీ ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరా, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ, విశాల్ సుదాం, హనిఫ్‌ఖాన్ తదితరులు

ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాక్

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ పెంచి పోషిస్తున్నదని సనత్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పెహల్గాం మారణహోమాన్ని ఖండిస్తూ, మృతులకు సంతాప సూచకంగా గురువారం రాత్రి పీజీ రోడ్డులోని మమతా స్వీట్ హౌస్ నుండి ఎస్పీ రోడ్డులోని వీర హనుమాన్ మందిర్ వరకు కొవ్వొతుల ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యాటకులపై దాడిని ఖండించారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం వల్లనే అనేక మంది ప్రాణాలు బలి అవుతున్నాయని అన్నారు. ఉగ్రవాదం విషయంలో కేంద్రం తీసుకునే చర్యలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ర్యాలీలో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లికార్జున్ గౌడ్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, శ్రీహరి, నరేందర్, కొశికే కిషోర్ కుమార్, శేఖర్, పీజీ రోడ్డు అసోసియేషన్ ప్రతినిధలు వంకమామిడి ప్రవీణ్, సంజయ్ లత పాటు పలు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

అడ్డగుట్ట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కాల్పులు జరిపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వెంకటేష్ కేంద్రాన్ని సూచించారు. శనివారం అడ్డగుట్ట సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సీపీఎం సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి ఎం. అజయ్ బాబు, ఆర్. మల్లేష్, బాలయ్య, శారద, మధు, గోపాల్, ఎల్లయ్య, వెంకటస్వామి, ఫాతిమా, శ్రీనివాస్, విజయ్‌లు పాల్గొన్నారు.



క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేటలో కొవ్వొత్తుల ర్యాలీ

తీవ్రవాదుల దాడిలో మృతి చెందినవారి ఆత్మశాంతికి సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బేగంపేటలోని రసూల్‌పురలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఐసీసీ ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరా, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమహాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ ఖేరా, కోట నీలిమ మాట్లాడుతూ ఉగ్రవాదులను అణిచివేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

పద్మారావునగర్‌లో..

పద్మారావునగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులు పర్యాటకులపై జరిపిన దాడికి నిరసనగా శుక్రవారం రాత్రి బన్సీలాల్‌పేట్ డివిజన్ జబ్బార్ కాంప్లెక్స్ వద్ద యువశక్తి ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కొవ్వొత్తులు వెలిగించి దాడిలో మృతి చెందినవారి ఆత్మలకు శాంతి కలగాలని ప్రదర్శన నిర్వహించారు. ఎ.శ్రీనివాస్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, గణేష్, నవీన్, మొగిలయ్య పాల్గొన్నారు.

ఏ శక్తీ కశ్మీర్‌ను భారత్ నుంచి విడదీయలేదు

సికింద్రాబాద్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఏ శక్తీ భారత్ నుంచి కశ్మీర్‌ను విడదీయలేవని, భారతదేశంతో పెట్టుకుంటే పుట్టగతులుండవని వక్తలు పేర్కొన్నారు. కశ్మీర్‌లో టెర్రరిస్టుల చేతిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మశాంతి కోసం శనివారం రాత్రి బోసునపల్లిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, మాజీ సభ్యుడు కె.పాండుయాదవ్, కాంగ్రెస్ నాయకుడు దండుగుల యాదగిరి, బీజేపీ నాయకుడు బాణుక మల్లిఖార్జున్, కాలనీవాసులు సాయిబాబాయాదవ్, విజయ్, నాగభూషణం, స్వరూప పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మక్తాల ఫౌండేషన్ సభ్యులు

కొవ్వొత్తుల ర్యాలీ

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదుల మారణకాండకు నిరసనగా మక్తల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సోమసుందరం స్ట్రీట్‌లో ప్రారభమై ప్యాట్నీ సెంటర్, మహంకాళి టెంపుల్‌ల మీదుగా జనరల్ బజార్‌లోని సాయిబాబా దేవాలయం వరకు కొనసాగింది. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జలందర్ గౌడ్ మాట్లాడుతూ.. పర్యాటకులపై జరిగిన మారణకాండను తీవ్రంగా ఖండించారు. ర్యాలీలో ఫౌండేషన్ సభ్యులు శ్రవన్, శివరతన్, హరికుమార్, పూర్ణ చందర్, చంద్రశేఖర్, శివకుమార్, నరసింహా చారి, వెంకటేష్ శ్రీనివాస్, ప్రసన్న సిద్దాంతి, ప్రకాష్, భాస్కర్‌లతో స్థానికులు పాల్గొన్నారు.



కశ్మీర్ పెహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులను కిరాతకంగా షూట్ చేసి చంపిన ఘటనలో మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో జనరల్ బజార్‌లోని ధర్మకాంత నుండి రంగ్రేజ్ బజార్, ఎంజీ రోడ్డు, సుభాష్ రోడ్డుల మీదుగా కొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సంఘం అధ్యక్షుడు గోపాలపురం ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గిర్మాపురం బాష్కరాచారి, కోశాధికారి బోనాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కటకం చక్రపాణిలతో పాటు సంఘం కార్యవర్గ సభ్యులు, పలువురు స్వర్ణకారులు పాల్గొన్నారు.

- (రాంగోపాల్‌పేట్ - ఆంధ్రజ్యోతి)



ఉగ్రవాదుల చేతుల్లో మృతి చెందిన టూరిస్టులకు ఆత్మకుశాంతి చేకూరాలని బొల్లారం రిసాలబజార్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నుంచి అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డాక్టర్ ఉదయ్ కిరణ్, ఉమేష్‌రావు, కేజీ రవి, అశోక్, యాదగిరి, కిరణ్, ప్రమోద్, చిట్టి, సోనీ తదితరులు పాల్గొన్నారు.

- తిరుమలగిరి ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి)



సంతాపం

ఉగ్రదాడిలో వీరమరణం పొందిన దాదాపు 28 మంది భారతీయులకు సంతాపం తెలుపుతూ అడ్డగుట్ట హనుమాన్ భక్తి సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి తుకారాంగేట్ చౌరస్తాలో క్యాండిల్‌ర్యాలీ నిర్వహించారు. అడ్డగుట్ట చంద్రయ్య హోటల్ నుంచి తుకారాంగేట్ సుభాష్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో అడ్డగుట్టకు చెందిన హిందు సంఘాల ప్రముఖులు పాల్గొన్నారు.

- (అడ్డగుట్ట - ఆంధ్రజ్యోతి)

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

అమీర్‌పేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఒకరిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అమీర్‌పేటలోని ఏషియన్ సత్యం మాల్ సమీపంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బందితో కలిసి శనివారం ఆకస్మికంగా దాడి చేశారు. యూసుఫ్‌గూడ సమీపంలోని మధురానగర్‌కు చెందిన భరత్‌కుమార్ పంపన(38) తన మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో రెండు నెలలుగా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. భరత్‌కుమార్‌ను అరెస్ట్ చేసి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి బ్యాంక్ ఖాతాలో రూ.2,640 నగదు ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.